సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 25 । మార్చి । 2025




టన్ను చీనీ రూ.24,120

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24,120, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



తగ్గిన చింత పండు ధర

చింతపండు ధర తగ్గింది. సోమవారం హిందూపురం మార్కెట్‌లో కరిపులి రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.27 వేలు, కనిష్టంగా రూ.8,100 పలికింది.



న్యూస్‌రీల్

ముగ్గురు ఇన్విజిలేటర్ల సస్పెన్షన్

- పదో తరగతి పరీక్షల విధుల్లో అలసత్వానికి ఫలితం

పుట్టపర్తి: పదో తరగతి పరీక్షల విధుల్లో అలసత్వం వహించిన ముగ్గురు ఇన్విజిలేటర్లు సస్పెండ్ అయ్యారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం గణితం పరీక్ష నిర్వహించారు. పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రత్యేకాధికారి సుబ్బారావు కదిరి నియోజకవర్గంలో పర్యటించి 10 కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన కదిరి బాలికల ఉన్నత పాఠశాల ఇన్విజిలేటర్లు రుద్రమరెడ్డి, డి.కృష్ణప్పను సస్పెండ్ చేయాలని డీఈఓను ఆదేశించగా...ఆయన ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. అలాగే ముదిగుబ్బ బాలికల ఉన్నత పాఠశాలలో ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థి మాస్ కాపీయింగ్ చేస్తూ స్క్వాడ్‌కు దొరికిపోయాడు. దీంతో సదరు విద్యార్థిని డీబార్ చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థి మాస్‌కాపీయింగ్ చేస్తున్నా.. ఎలాంటి చర్యలు తీసుకోని ఇన్విజిలేటర్ మహమ్మద్ రఫీని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు డీఈఓ కృష్ణప్ప తెలిపారు. అంతేకాకుండా సదరు పరీక్ష కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లను విధుల నుంచి తప్పించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. వారి స్థానంలో కొత్త వారిని నియమించామని వెల్లడింతారు.

పరీక్షకు 145 మంది విద్యార్థుల గైర్హాజరు

సోమవారం జరిగిన పదో తరగతి గణితం పరీక్షకు 145 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ కృష్ణప్ప తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 104 కేంద్రాల్లో సోమవారం గణితం పరీక్షకు 21,629 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 21,484 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. మరో 145 మంది గైర్హాజరయ్యారని డీఈఓ వివరించారు.

108.5 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం

పుట్టపర్తి అర్బన్: అకాల వర్షాలతో జిల్లాలో 108.5 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం జరిగినట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న అకాలవర్షంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. దీంతో రెవెన్యూ, ఉద్యానశాఖ సిబ్బంది ఆయా గ్రామాల్లో పర్యటించి పంటనష్టంపై ప్రాథమిక అంచనా రూపొందించినట్లు వెల్లడించారు. ఇందులో తాడిమర్రి మండలంలోని దాడితోట, ముదిగుబ్బ మండలంలోని కొడవాండ్లపల్లి, కొండగుట్టపల్లి ,మర్తాడు గ్రామాల్లో సుమారు 115 మంది రైతులకు చెందిన 108.5 హెక్టార్లలో అరటి తోటలు నేలకొరిగినట్లు గుర్తించామన్నారు. పంటనష్టానికి సంబంధించినన నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.

29లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలి

ప్రశాంతి నిలయం: జిల్లాలోని రేషన్ కార్డుదారులందరూ ఈ నెల 29వ తేదీలోపు ఈ-కేవైసీ చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ-కేవైసీ పూర్తి చేసుకోని వారికి రేషన్ సరుకులు అందే అవకాశం లేదన్నారు. జిల్లాలోని 5 లక్షలకు పైగా ఉన్న రేషన్‌కార్డుల్లో 16,89,531 మంది సభ్యులుగా ఉన్నారన్నారు. వారిలో ఇప్పటి వరకు 15,17,689 మంది ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నారని, ఇంకా 1,71,842 మంది ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. వారంతా వెంటనే గ్రామ/వార్డు సచివాలయాలు, మొబైల్ యాప్, రేషన్ షాపుల్లోని ఈ-పాస్ పరికరాల ద్వారా ఈ-కేవైసీ ఆప్‌డేట్ చేయించుకోవాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు మినహా కార్డుల్లో పేర్లున్న వారంతా ఈ-కేవైసీ పూర్తి చేయించుకోవాలని జేసీ సూచించారు.

ఖాద్రీశుడి హుండీ ఆదాయం రూ.82.64 లక్షలు



నగదు లెక్కిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరిగిన 15 రోజులకు గానూ హుండీల ద్వారా రూ.82,64,892 నగదు, 12 గ్రాముల బంగారం, 302 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అలాగే 21 అమెరికా డాలర్లు, 20 కెనడా, 20 ఆస్ట్రేలియా డాలర్లు, 7 ఓమన్ రియాల్ వచ్చినట్లు వెల్లడించారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది ఆదాయం పెరిగిందన్నారు. కార్యక్రమంలో హుండీల పర్యవేక్షణాధికారి ఎస్.ప్రసాద్, కెనరా బ్యాంక్ మేనేజర్ అనంతబాబు, బ్యాంక్ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

- అనంతపురంలోని శ్రావణి ఫర్టిలైజర్స్ యజమాని నకిలీ కళింగర విత్తనాలు ఇవ్వడంతో పంట సర్వస్వం కోల్పోయిన బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లె రైతు వారం రోజుల క్రితం షాపు దగ్గరే పురుగుల మందు తాగారు. స్థానికులు తక్షణమే ఆస్పత్రికి చేర్చడంతో బతికి బయటపడ్డారు. ఇంత జరిగినా శ్రావణి ఫర్టిలైజర్స్ యజమానిపై ఇప్పటికీ చర్యలు లేవు.

- రెండు రోజుల క్రితం జిల్లాలో పలు చోట్ల అకాల వర్షం కురిసింది. ఈదురుగాలులకు అరటి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. శింగనమల నియోజకవర్గానికి చెందిన ఇద్దరు రైతులు వ్యవసాయాధికారులకు ఫోన్ చేసి ఇలా జరిగిందని చెబితే స్పందించలేదు. దీంతో బాధితులు పురుగుల మందు తాగారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



ఇలాగైతే రైతు బతికేదెట్లా?!

- ఉమ్మడి జిల్లాలో దారుణంగా రైతన్నల పరిస్థితి
- రెండు రోజుల క్రితం ఈదురుగాలుల బీభత్సంతో తీవ్ర నష్టం
- అయినా స్పందించని పాలకులు
- మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన అనంతరం హడావుడిగా మంత్రి సవిత పర్యటన

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. పట్టెడన్నం పెట్టే రైతన్నకు పుట్టెడు దుఃఖమే మిగులుతోంది. వ్యవసాయ, రెవెన్యూ అధికారుల వద్దకు రైతులు పురుగు మందు బాటిళ్లతో వెళ్తుండటం ఇక్కడి దారుణ పరిస్థితులకు అద్దం పడుతోంది. 'మేం అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు రూ.20 వేలు సాయం చేస్తాం.. సబ్సిడీ ఇస్తాం, రైతును రాజు చేస్తాం' అంటూ చెప్పిన 'కూటమి' నేతలు పత్తా లేకుండా పోయారు.

నకిలీ విత్తనాలు.. అకాల వర్షాలు

రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొంతమంది.. నకిలీ విత్తనాలు కట్టబెడుతున్నారు. దీంతో పంట చేతికి అందక అన్నదాతలు లబోదిబోమంటున్నారు. అప్పటికే పెట్టుబడులు రూ.లక్షలు అవుతుండటంతో దుఃఖంలో కూరుకుపోతున్నారు. ఒక వేళ పంట బాగుందనుకున్నా.. చివరి దశలో ప్రకృతి వైపరీత్యాలు నిండా ముంచేస్తున్నాయి. రెండు రోజుల క్రితం అకాల వర్షానికి జిల్లా వ్యాప్తంగా వందల ఎకరాల్లో అరటి, దోస (కర్బూజా) తోటలు సర్వనాశనమయ్యాయి. కోతలకు సిద్ధమైన పంట ఒక్కసారిగా తుడిచిపెట్టుకుపోవడంతో అన్నదాతల ఆవేదన అంతా ఇంతా కాదు.

ముగ్గురు మంత్రులున్నా..

గత సర్కారు హయాంలో ఏదైనా పంట నష్టం జరిగితే మంత్రులు లేదా ఎమ్మెల్యేలు, అధికారులు వెంటనే బాధిత రైతుల దగ్గరికి వెళ్లేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా వాళ్లు ఎక్కడున్నారో తెలియదు. ఇటీవల రైతులు ఆత్మహత్యాయత్నం చేసినా ఎవరూ స్పందించలేదు. అయితే, పులివెందుల నియోజకవర్గం లింగాల మండలంలో పంట నష్టాన్ని పరిశీలించడానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రావడంతో.. ఇక్కడ మంత్రి సవిత హడావిడిగా యల్లనూరు మండల పర్యటన ఖరారు చేశారు. సామాజిక మాధ్యమాల్లోనూ తీవ్ర విమర్శలు రావడంతో మంత్రి సోమవారం మధ్యాహ్నం వెళ్లారు.

మద్యం ఆదాయమే ముఖ్యం..

జిల్లాలో సుమారు 150 వరకూ మద్యం షాపులు ఉన్నాయి. వీటిలో 85 శాతం మద్యం షాపులు ఎమ్మెల్యేలు, వారి అనుచరులవే. 'రైతులు ఎట్లైనా పోనీ మా మద్యం వ్యాపారం బాగా జరిగిందా లేదా' అన్నదే వీరి విధానంగా మారింది. పర్మిట్ రూములు, బెల్టుషాపులతో నిత్యం కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్న ఎమ్మెల్యేలు... నష్టాలతో నట్టేట మునిగిన రైతన్నలను పట్టించుకున్న పాపాన పోవడం లేదు. గిట్టుబాటు ధరలు లేకపోవడం, అకాల వర్షాలు వెరసి కూటమి సర్కారు జమానాలో రైతులు నిస్సహాయులై ఉన్నారు.



డీఆర్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న ఈ రైతు పేరు కర్రా రామలింగారెడ్డి. కనగానపల్లి మండలం వేపకుంట గ్రామం. ఇటీవల 'కావేరి సీడ్స్' పేరుతో గ్రామానికి చెందిన ఏడుగురికి వ్యాపారి పూర్ణచంద్రరావు మొక్కజొన్న విత్తనాలు విక్రయించాడు. ఎకరాకు మూడు నుంచి ఐదు టన్నుల దిగుబడి వస్తుందని నమ్మబలికాడు. దీంతో గ్రామ రైతులు సుమారు 30 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. అయితే ఏ ఒక్కరికీ సరైన దిగుబడి రాలేదు. రామలింగారెడ్డి ఐదెకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా.. ఒకటిన్నర టన్ను మాత్రమే దిగుబడి వచ్చింది. ఈ క్రమంలో రైతులను మోసం చేసిన పూర్ణచంద్రరావుపై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రామలింగారెడ్డి ఫిర్యాదు చేశారు. నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు.

ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలి

- అధికారులకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: ''తమ సమస్యలు పరిష్కారమవుతాయన్న నమ్మకంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు జిల్లా కేంద్రం వరకూ వచ్చి అర్జీ ఇస్తున్నారు. ఇందుకోసం వారు పనులు మానుకోవడంతో పాటు చార్జీల కోసం డబ్బు వెచ్చిస్తున్నారు. దీన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలి'' అని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తంగా 227 అర్జీలు అందగా, వాటి పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపారు. అనంతరం ఆయన జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. అర్జీలకు పరిష్కారం చూపే క్రమంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. ఒకే ఫిర్యాదు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అర్జీల పరిష్కారం పురోగతిని కూడా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయ సారథి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, పట్టు పరిశ్రమ శాఖ జేడీ పద్మావతి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ల్యాండ్ సర్వే ఏడీఈ విజయశాంతి బాయి, ఎల్‌డీఎం రమణకుమార్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజా బేగం, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం 'ధర్మా'గ్రహం



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

ధర్మవరం: నెలరోజులైనా తాగునీరు సరఫరా చేయని మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ధర్మవరంలో ప్రజలు ఆందోళనకు దిగారు. ఎల్-4 కాలనీకి చెందిన మహిళలు సోమవారం ఎస్ఎస్ గేటుకు వెళ్లే ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. దీంతో రెండు గంటలకుపైగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ... తమ కాలనీకి రెండు నెలలుగా తాగునీరు సరఫరా చేయడం లేదని, మున్సిపల్ డీఈకి పలుమార్లు ఫోన్‌లు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్లే తప్పనిసరి పరిస్థితుల్లో తామంతా రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. తమ కాలనీకి తాగునీరు అందించేదాకా ఆందోళన కొనసాగిస్తామన్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు అక్కడికి చేరుకుని మహిళలకు సర్ది చెప్పారు. వెంటనే తాగునీరు సరఫరా చేస్తామని చెప్పడంతో వారు రాస్తారోకోను విరమించారు.

సవితా.. నీ స్థాయి తెలుసుకో

- మరోసారి ఇష్టానుసారం మాట్లాడితే ఊరుకోం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హెచ్చరిక



విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: ''మంత్రి సవిత నోటికి ఏది వస్తే అది మాట్లాడుతోంది. నాలుక ఉంది కదా అని ఇష్టానుసారం విమర్శలు చేస్తోంది. కానీ ఆమె తన స్థాయి తెలుసుకుని మాట్లాడాలి. ఇంకోసారి తమ పార్టీనిగానీ, తమ అధినేత వైఎస్ జగన్‌పై గానీ నోరుజారితే ఊరుకునే ప్రసక్తే లేదు' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హెచ్చరించారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఓ జాతీయ పార్టీని రాష్ట్రంలో నామరూపాల్లేకుండా చేసిన ఘనత తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని గుర్తించుకోవాలన్నారు. సింహంలా ఎవరి పొత్తు లేకుండా సింగిల్‌గా ఎన్నికల్లో పోటీ చేసిన వైఎస్సార్ సీపీకి 40 శాతం మంది ఓటు వేసిన విషయం తెలుసుకోవాలన్నారు. తాము టీడీపీలాగా... రోజుకో పార్టీతో జతకట్టి దిగజారుడు రాజకీయాలు చేయలేమన్నారు. ఇప్పటికైనా మంత్రి సవిత వాస్తవాలు తెలుసుకుని తన స్థాయి గుర్తించుకుని మాట్లాడాలన్నారు. నిజంగా ఆమెకు చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలు నెరవేర్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఒత్తిడి తేవాలన్నారు.

దందాలు నిజం కాదా?

పెనుకొండ నియోజకవర్గంలోని క్రషర్ల యజమానులపై మంత్రి, ఆమె అనుచరులు అజమాయిషీ చేస్తున్న విషయం నిజం కాదా అని ఉషశ్రీచరణ్ ప్రశ్నించారు. ఇందులో మంత్రికి ఏమైనా సందేహముంటే ఆమెపై ఆమె ఇంటిలిజెన్స్ రిపోర్ట్ తెప్పించుకుంటే కళ్లు బైర్లుకమ్మే వాస్తవాలు తెలుస్తాయన్నారు. మంత్రి అనుచరులు రొద్దం, పరిగి మండలాల నుంచి ఇసుక దందాలకు తెర లేపారని, గోరంట్ల, పాలసముద్రం, గొందిపల్లి, గ్రామాల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తు సొమ్ము చేసుకుంటున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. కాదనే దమ్ము సవితకు ఉంటే నిరూపించుకోవాలన్నారు.

భార్యపై హత్యాయత్నం.. భర్తకు పదేళ్ల జైలు



అనంతపురం/పుట్టపర్తి టౌన్: భార్యను వేధించడంతో పాటు హత్య చేసేందుకు యత్నించిన భర్తకు పదేళ్ల జైలు శిక్ష పడింది. ఈ మేరకు అనంతపురం నాలుగో జిల్లా కోర్టు న్యాయమూర్తి శోభారాణి సంచలన తీర్పు వెలువరించారు. వివరాలు.. శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం పొడరాళ్లపల్లి గ్రామానికి చెందిన కిష్టప్ప కుమారుడు చాకలి రాజశేఖర్‌కు, పుట్టపర్తి మండలం వెంకటగారి పల్లికి చెందిన చాకలి సావిత్రికి 2016లో వివాహమైంది. దంపతులిద్దరూ ముదిగుబ్బలో కాపురం పెట్టారు. ఆరు నెలల్లోనే భార్య సావిత్రిపై రాజశేఖర్ అనుమానం పెంచుకున్నాడు. తరచూ దూషించేవాడు. చంపుతానని బెదిరించేవాడు. వేధింపులు తట్టుకోలేక సావిత్రి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అక్కడికే వెళ్లిన రాజశేఖర్ ఆమెను కొట్టడమే కాకుండా తండ్రి ఓబులేసు ఫోన్ తీసుకెళ్లిపోయాడు. ఈ క్రమంలోనే 2017 అక్టోబర్ 11న మధ్యాహ్నం 3 గంటల సమయంలో భార్యకు ఫోన్ చేసి.. తాను అరటికాయ లోడు తీసుకెళ్లడానికి వెళ్తున్నానని, వెంకటగారిపల్లి క్రాస్ వద్దకు వస్తే సెల్‌ఫోన్ ఇస్తానని పేర్కొన్నాడు. ఈ క్రమంలోనే అక్కడికి సావిత్రి వెళ్లగా.. కంపచెట్లలో దాక్కుని ఉన్న రాజశేఖర్ ఉన్నపలంగా సావిత్రిపై దాడికి పాల్పడ్డాడు. ఎడుమ భుజం వెనుక, కుడిపక్క గొంతు కింద రెండు పోట్లు పొడిచాడు. అంతలోనే సావిత్రి అక్క కుమారుడు సాయి కృష్ణ, అతని స్నేహితుడు సాయి కుమార్, బావ రాము అక్కడికి రావడం చూసి పారిపోయాడు. గాయపడిన సావిత్రిని వెంటకగారి పల్లి సర్పంచ్ చిన్న రామప్ప 108 అంబులెన్స్‌లో పుట్టపర్తి సూపర్‌స్పెషాలిటీకి తరలించారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు విచారించిన అనంతపురం నాలుగో జిల్లా కోర్టు న్యాయమూర్తి శోభారాణి సోమవారం తీర్పు వెలువరించారు. ముద్దాయి చాకలి రాజశేఖర్‌కు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున సుజన వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ ధనుంజయ, పుట్టపర్తి రూరల్ ఎస్ఐ కేఎం లింగన్న, హెడ్ కానిస్టేబుల్ డి. శివ, మనోహర్, కోర్టులైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు (ఏఎస్ఐ)ను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

మూగజీవి ఆరోగ్యానికి ముప్పు!

- నిలిచిన సంచార పశువైద్య వాహనాలు
- రాత్రికి రాత్రే ఉద్యోగులను తొలగిస్తూ ఉత్తర్వులు
- నెలరోజులుగా అందని వైద్య సేవలు

- పెనుకొండ మండలం మావటూరుకు చెందిన మల్లికార్జున ఎద్దులపై ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఓ ఎద్దు ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో ఈనెల 15న సంచార పశువైద్యసేవల కోసం డయల్ 1962కు ఫోన్ చేశాడు. అదిగో..ఇదిగో అని చెప్పిన సిబ్బంది ఆ తర్వాత ఫోన్ తీయడం మానేశారు. తనకు తెలిసిన వారి ద్వారా సిబ్బంది పర్సనల్ నంబర్ తీసుకుని ఫోన్ చేయగా..తమను ఉద్యోగాల నుంచి తొలగించారని, సంచార పశువైద్య సేవలు బంద్ చేశారని చెప్పారు. దీంతో ఏం చేయాలో తెలియని మల్లికార్జున రూ.2 వేలు చెల్లించి ప్రైవేటు వాహనంలో హిందూపురం పశువుల ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించుకున్నాడు.

..ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. సంచార పశువైద్యం కోసం ఏర్పాటు చేసిన 1962 నంబర్‌కు ఫోన్ చేస్తే సమాధానం చెప్పేవారే లేకుండా పోయారు. జిల్లాలోని 6 వాహనాల్లో పనిచేసే సిబ్బందిని ప్రభుత్వం నెల రోజుల క్రితం తొలగించడంతో పశువైద్యం దైవాదీనంగా మారింది.

పెనుకొండ: పశువులు జబ్బుబారిన పడినా, ప్రమాదాలకు గురైనా ఆస్పత్రుల వరకూ తీసుకువెళ్లేందుకు రైతులకు ఇబ్బందులు లేకుండా గత వైఎస్ జగన్ సర్కార్ సంచార పశువైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. 1962 హెల్ప్ లైన్ నంబర్‌కు ఫోన్ చేస్తే చాలు పశువుల అంబులెన్స్‌లో వైద్యుడు, సిబ్బంది ఇంటివద్దకే వచ్చి పశువులకు వైద్యం అందించేవారు. దీంతో రైతులకు ఎంతో మేలు జరిగేది. కానీ ఇప్పుడా సంచార పశువైద్య సేవలందించే వాహనాలు నెలరోజుల క్రితం ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో అత్యవసర వైద్య సేవలు అందక మూగజీవాలు అల్లాడిపోతుంటే రైతులు దిక్కు తోచని స్థితిలో పడ్డారు.



పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో నిలిచి ఉన్న సంచార పశు ఆరోగ్య వాహనం

ఉద్యోగులను తొలగిస్తూ ఉత్తర్వులు..

సంచార పశువైద్య సేవల కోసం మొదటి దశలో రాష్ట్ర వ్యాప్తంగా 175, రెండో దశలో మరో 175 సంచార వాహనాలను జగనన్న ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. సంచార పశువైద్య బాధ్యతలను జీవీకే సంస్థకు అప్పగించింది. దీంతో సదరు సంస్థ ఒక్కో సంచార వైద్యం సేవందించే వాహనంలో వైద్యుడితో పాటు డ్రైవర్ కమ్ అటెండర్, మరో సహాయకుడి చొప్పున నియమించింది. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో తొలిదశలో 13 వాహనాలు అందుబాటులోకి రాగా 39 మందిని నియమించింది. ఇందులో శ్రీసత్యసాయి జిల్లాకు 6 వాహనాలు, 18 మంది సిబ్బందిని కేటాయించారు. దీంతో వారంతా మారుమూల పల్లెలు, పొలాల వద్దకే వెళ్లి పశువులకు వైద్య సేవలు అందించేవారు. అవసరమైతే వాహనంలోనే ఆస్పత్రికి తరలించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే పశు సంచార వైద్యసేవల బాధ్యతలను చూస్తున్న జీవీకే సంస్థను తొలగించింది. అంతేకాకుండా జిల్లాలోని సంచారవాహనాల్లో పనిచేస్తున్న 18 మంది సిబ్బందిని తొలగిస్తూ ఫిబ్రవరి 15న ఉత్తర్వులు జారీ చేసింది. నేటికీ మరో సంస్థకు కాంట్రాక్టు ఇవ్వలేదు. దీంతో సంచార వైద్య సేవలు అందక రైతులు, పశువుల కాపర్లు ఇబ్బందులు పడుతున్నారు.



పాడి ఆవుకు అత్యవసర సేవలు అందిస్తున్న పశు సేవా వాహన ఆరోగ్య సిబ్బంది (ఫైల్)

త్వరలోనే సేవల పునరుద్ధరణ

ప్రస్తుతం జిల్లాలోని ఆరు సంచార పశు ఆరోగ్య వాహనాలు నిలిచాయి. ఈ వాహనాల బాధ్యతలను కొత్త సంస్థకు ఇవ్వాలన్న ఆలోచనతో ప్రభుత్వం సేవలను నిలుపుదల చేసింది. పూర్తిస్థాయిలో అగ్రిమెంట్, టెండర్ పూర్తయ్యాక వాహన సేవలు అందుబాటులోకి వస్తాయి. త్వరలోనే సంచార పశువైద్య సేవలు పునరుద్ధరిస్తాం. – శుభదాస్, పశుశాఖ జేడీ

రైతులకు ఇబ్బంది కలగనీయొద్దు

జిల్లాలో చాలా మంది రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువులపై ఆధారపడి బతుకుతున్నారు. అలాగే గొర్రెలపై ఆధారపడి కాపర్లు జీవిస్తున్నారు. మూగజీవాలకు ఎలాంటి ఆరోగ్య సమస్య తలెత్తినా రైతులు, కాపర్లు తీవ్ర ఇబ్బందులు పడతారు. అత్యవసర సమయంలో వైద్యం అందక పోతే రూ.లక్షలు నష్టపోతాం. అందువల్ల ప్రభుత్వం వెంటనే సంచార పశువైద్య సేవలందించే వాహనాలు అందుబాటులోకి తేవాలి.

– రామన్న, పైదేటి, పరిగి మండలం

రాత్రికి రాత్రే తొలగింపు ఉత్తర్వులు

సంచార పశు ఆరోగ్య వాహనంలో సేవలు అందించే ఉద్యోగులను ప్రభుత్వం రాత్రికి రాత్రే తొలగించింది. పశువులు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయంటూ ప్రతి రోజూ రైతుల నుంచి ఫోన్లు వస్తున్నా...మేము ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నాం. ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకుంటేనే రైతులకు, జీవాల కాపర్లు మేలు జరుగుతుంది.

– పవన్, సంచార పశు ఆరోగ్య ఉద్యోగి

EAMCET TARGET 120+ Marks
NEET TARGET 600+ Marks JEE TARGET 160+ Marks
తేజ 9948567527, 9490859421

EAPCET BATCH STARTED
NEET JEE-IIT
AC CAMPUS | ONLY GIRLS
GLOBAL SCHOOL COLLEGE Near SJR Function Hall Opp. TV Tower, ANANTAPUR
9247134363, 8555826272

క్లుప్తంగా

క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు



ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజాబేగం

పుట్టపర్తి అర్బన్: క్షయ వ్యాధిపై నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాంతకంగా మారుతుందని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజా బేగం అన్నారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య, జిల్లా క్షయ నివారణ శాఖల ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి ప్రశాంతి గ్రామంలోని వై జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి క్షయ పోషణ పథకంలో భాగంగా క్షయ చికిత్స చేయించుకున్న వారికి నెలకు రూ.1000 అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ తిప్పయ్య, డీఎస్పీ విజయ్‌కుమార్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, ధర్మవరం ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ వాసుదేవరెడ్డి, టీబీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు. అనంతరం టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 29 పంచాయతీలకు కలెక్టరేట్‌లో అవార్డులను అందజేశారు.

హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులు ఆపాలి

- ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులు ఆపి కాలువ వెడల్పు చేయాలని, లైనింగ్ పనులు ఆపకపోతే ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో యంత్రాలు ధ్వంసం చేస్తామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం పుట్టపర్తిలోని కార్మిక కర్షక భవనంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతపురం జిల్లా ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు గిరీషం, సీపీఐ జిల్లా నాయకులు కాటమయ్య, మహదేవ పాల్గొని ప్రసంగించారు. హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులతో భూగర్భజలాలు అడుగంటి రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. జీఓ నంబర్ 404, 405ను తక్షణమే రద్దు చేయాలని, హంద్రీనీవా కాలువ వెడల్పు పనులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సోముశేఖర్, రమణ, లక్ష్మీనారాయణ, రాజారామిరెడ్డి, సిద్ధారెడ్డి, కదిరెప్ప, మారుతి, శ్రీరాములు,నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఏప్రిల్ 23 వరకూ ఒంటి పూట బడులు
- మధ్యాహ్నం 12:30 గంటలకే ఇంటికి చేరుతున్న విద్యార్థులు
- సరదాల మాటున పొంచి ఉన్న ప్రమాదాలు
- కనిపెట్టకపోతే భారీ మూల్యం చెల్లించక తప్పదు





ఒంటి పూట.. కనిపెట్టాలి ఓ కంట!

రాయదుర్గం: ఎండల తీవ్రత పెరిగిపోతుండడంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యాశాఖ ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభించింది. ఏప్రిల్ 23 వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నీ ఈ నిబంధన పాటించేలా మార్గదర్శకాలు జారీచేసింది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. త్వరగా నిద్ర లేచి ఉరుకులు పరుగులతో బడికి వెళ్లిన విద్యార్థులు మధ్యాహ్నం ఇళ్లకు చేరుకోగానే ఆటపాటలకు ప్రాధాన్యమివ్వడం సర్వసాధారణం. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ, నగర ప్రాంతాల్లోనూ వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు ఈతకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఆటలు, ఈత శారీరక వ్యాయామంగా మంచిదే అయినా... ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న సరదా మాటున ప్రమాదాలు పొంచి ఉంటాయనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఉష్ణ తాపం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పిల్లలకు అవగాహన కల్పించాలని చెబుతున్నారు.

4 లక్షలకు పైగా విద్యార్థులు మండుటెండలోనే..

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 5,036 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 7,03,094 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు 54,402 మంది మినహా మిగిలిన వారంతా ఒంటిపూట బడులకు హాజరవుతున్నారు. అలాగే 4,72,860 మందికి పైగా విద్యార్థులు ఇతర గ్రామాలకు, పట్టణాల్లో ఉండే ప్రైవేటు పాఠశాలలకు వాహనాలు, కాలినడకన వెళ్లి వస్తుంటారు. వీరంతా మధ్యాహ్నం 12:30 గంటల తర్వాత పాఠశాల నుంచి మండుటెండలో ప్రయాణం చేయాల్సి ఉంటోంది. ఇలాంటి తరుణంలో పిల్లలు సరైన జాగ్రత్తలు తీసుకునేలా ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులూ చొరవ చూపాలి. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా టోపీ ధరించడం లేదా, తల.. ముఖ భాగం పూర్తిగా కప్పి ఉంచేలా వస్త్రం కట్టుకుంటే మరీ మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

తీవ్ర సూర్యరశ్మితో ప్రమాదం..

ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సూర్యుడి కిరణాలు నిటారుగా భూమిపై పడుతుంటాయి. ఈ సమయంలో ఎక్కువగా బయట తిరిగితే అతినీలలోహిత కిరణాలు నేరుగా శరీరాన్ని తాకడం వల్ల చర్మ సంబంధిత వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. మరోవైపు అంతర్గతంగా కూడా ఈ కిరణాల ప్రభావం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. బడి ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి చేరుకున్న పిల్లలను తప్పనిసరి అయితే తప్పా బయటకు పంపకూడదని సూచిస్తున్నారు. ప్రయాణాల సమయంలో ద్విచక్ర వాహనంపై పిల్లలను ముందు భాగంలో కూర్చోబెట్టుకుంటే వడగాలుల తీవ్రతకు వడదెబ్బ సోకే ప్రమాదం ఉందంటున్నారు.

బోర్ అనిపించకుండా..

ఇంట్లో పిల్లలు ఖాళీగా ఉంటే చాలా బోర్‌గా ఫీలవుతారు. దీంతో సెల్‌ఫోన్లకు అలవాటు పడితే మరింత ప్రమాదం. పిల్లలు బోర్ ఫీల్ కాకుండా ఉండేందుకు నీడ పట్టున వారికి కొత్త ఆటలు గాని, విజ్ఞానాన్ని పంచే అంశాలపై ఆసక్తి పెంపొందించాలి. వీలైనంత మేర తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎక్కువ సమయం గడిపేందుకు ప్రయత్నించాలి. పాఠశాలల్లో ఇచ్చిన హోమ్‌వర్క్ మధ్యాహ్నం చేసుకునేలా ప్రోత్సహించాలి. తద్వారా సాయంత్రం ఎండ తగ్గిన తర్వాత ఆడుకునే వెసులుబాటు కలుగుతుంది. వేసవి తాపం కారణంగా పిల్లలు తొందరగా అలసిపోతారు కావున, మధ్యాహ్నం కొంత సమయం విశ్రాంతి తీసుకునేలా చూడాలి.



మృతుడు రిహాన్ (ఫైల్)



మృతుడు అయాన్ (ఫైల్)

హిందూపురంలోని ఆటోనగర్‌లో నివాసముంటున్న జమీర్ కుమారుడు రిహాన్ (14), సుహేల్, ఉమేరా దంపతుల కుమారుడు అయాన్ (12) స్థానిక పాఠశాలలో 7, 6 తరగతులు చదువుకుంటున్నారు. ఈ నెల 9న ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో తోటి స్నేహితులతో కలసి సరదాగా ఈత కొట్టేందుకు సమీపంలోని నీటి కుంటకు వెళ్లారు. లోతైన ప్రాంతానికి వెళ్లడంతో నీట మునిగిపోయారు. తోటి స్నేహితుల కేకలతో అప్రమత్తమైన చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని నీట మునిగిన ఇద్దరినీ వెలికి తీశారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. చికిత్సకు స్పందించక రిహాన్, అయాన్ మృతి చెందారు.

... ఇలాంటి దుర్ఘటనలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కోకొల్లలుగా జరుగుతున్నాయి. సెలవుల్లో పిల్లలను ఓ కంట కనిపెట్టకపోతే ఎంత అనర్థాలకు దారి తీస్తుందో ఈ ఘటన స్పష్టం చేస్తోంది.

తేలికపాటి ఆహారం మంచిది



వేసవిలో పిల్లలకు తేలిక పాటి ఆహారం చాలా మంచిది. త్వరగా జీర్ణమయ్యే ఉప్మా, ఇడ్లీ వంటివి అల్పాహారంగా ఇవ్వాలి. పండ్ల రసాలు తాగించి బడికి పంపాలి. నీరు ఎక్కువగా తాగిస్తూ ఉండాలి. మరీ చల్లని పదార్థాలు ఇవ్వొద్దు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తర్వాత తేలికగా ఉండే ఆహారం ఇవ్వాలి. వేపుళ్లు, మాంసాహారం వంటి వాటికి వేసవి పూర్తయ్యే వరకూ స్వస్తి చెప్పడం మేలు. రాత్రి పూట త్వరగా నిద్రించేలా అలవాటు చేయాలి. నిద్ర లేచిన తర్వాత కొంత సమయం చదువుకునేలా అలవాటు చేస్తే మేధాశక్తి పెరుగుతుంది.

– డాక్టర్ మెర్సీ జ్ఞానసుధ, మెడికల్ సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, రాయదుర్గం

విద్యార్థిని అదృశ్యం

బత్తలపల్లి: సర్టిఫికెట్లు జిరాక్స్ చేయించుకుని వస్తానంటూ వెళ్లిన విద్యార్థిని కనిపించకుండా పోయింది. పోలీసులు తెలిపిన మేరకు.. బత్తలపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అనంతపురంలోని పీవీకేకేలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. కళాశాలకు సెలవుల నేపథ్యంలో వారం రోజులుగా ఇంటి పట్టునే ఉన్న ఆమె శనివారం తన ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించుకుని, సర్టిఫికెట్లు జిరాక్స్ చేయించుకుని వస్తానంటూ కుటుంబసభ్యులకు తెలిపి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి రాలేదు. గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తన కుమార్తె కనిపించడం లేదంటూ పోలీసులకు బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత బలవన్మరణం



రాజేశ్వరి (ఫైల్)

గాండ్లపెంట: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గాండ్లపెంట మండలం వంకపల్లికి చెందిన వద్దిరెడ్డి రాజేశ్వరి (30) వేపరాల గ్రామ సచివాలయంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్‌గా, భర్త ఈశ్వరరెడ్డి ఎఫ్‌ఈఎస్ స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం వ్యక్తిగత పనిపై ఈశ్వరరెడ్డి అనంతపురానికి వెళ్లాడు. చిన్న కుమారుడు అభిలాష్ పాఠశాలకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజేశ్వరి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మధ్యాహ్నం పాఠశాల నుంచి ఇంటికి చేరుకున్న అభిలాష్ ఇంట్లో ఫ్యాన్‌కు విగతజీవిగా వేలాడుతున్న తల్లిని గమనించి పక్కింటి వారికి తెలపడంతో వారి సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. అల్లుడు ఈశ్వరరెడ్డి వేధింపులు తాళలేకనే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందంటూ మృతురాలి తల్లి చేసిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వలీబాషా కేసు నమోదు చేశారు.

లారీల ఢీ - డ్రైవర్ దుర్మరణం



మృతుడు ప్రసాద్

కనగానపల్లి: మండలంలోని 44వ జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీ కొన్నాయి. ఘటనలో నంద్యాల జిల్లా బనగానపల్లి మండలం పెద రాజుపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ ప్రసాద్ (45) దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల వివరాల మేరకు... సోమవారం తెల్లవారుజామున అనంతపురం వైపు నుంచి బెంగళూరు వైపు వెళుతున్న లారీ పర్వతదేవరపల్లి వద్దకు చేరుకోగానే డ్రైవర్ ఒక్కసారిగా వేగాన్ని తగ్గించాడు. దీంతో వెనుకనే వస్తున్న లారీ డ్రైవర్ వేగాన్ని నియంత్రించుకునే సమయం కూడా లేకపోవడంతో నేరుగా వెళ్లి ముందున్న లారీని ఢీకొన్నాడు. ఘటనలో వెనుక ఉన్న లారీ క్యాబిన్‌లోనే డ్రైవర్ ప్రసాద్ చిక్కుకున్నాడు. స్థానికులు గమనించి అతి కష్టంపై ఆయనను వెలికి తీశారు. అప్పటికే తీవ్ర రక్తస్రావంతో ఆయన మృతి చెందాడు. ఘటనపై కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రాజ్యాంగ పరిరక్షణకు పోరుబాట

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న కె.రామకృష్ణ

హిందూపురం టౌన్: ప్రధాని నరేంద్రమోదీ అనుసరిస్తున్న మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా, రాజ్యాంగ పరిరక్షణకు పోరుబాట పడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. 'రాజ్యాంగ పరిరక్షణ' అంశంపై సోమవారం హిందూపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ స్ఫూర్తితో సీపీఐ పోరాటాలను ఉధృతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని పరిరక్షణకు లౌకికవాదులంతా ఏకం కావాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య మాట్లాడుతూ... హంద్రీనీవా ద్వారా తాగు, సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్, సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆటో నుంచి కిందపడి బాలిక మృతి



మృతురాలు వైష్ణవి

చిలమత్తూరు: హిందూపురం పరిధిలోని కొట్నూరు సమీపంలో వేగంగా వెళుతున్న ఆటో నుంచి ప్రమాదవశాత్తూ కింద పడి కొట్నూరుకు చెందిన వైష్ణవి(13) మృతి చెందింది. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో కిందపడడంతో తీవ్ర గాయాలైన వైష్ణవిని స్థానికులు వెంటనే హిందూపురంలోని జిల్లాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స మొదలు పెట్టే లోపు ఆమె మృతి చెందింది. ఘటనపై ఎస్‌ఐ శ్రీధర్ దర్యాప్తు చేపట్టారు.

సారా రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య



మాట్లాతున్న డీసీ నాగముద్దయ్య

పుట్టపర్తి టౌన్: నాటు సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య తెలిపారు. సోమవారం పుట్టపర్తిలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయంలో సూపరింటెండెంట్ నరసింహులు అధ్యక్షతన నిర్వహించిన నేర సమీక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు నాటుసారా, నవోదయం, అక్రమ మద్యం రవాణాపై సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నాటుసారా తయారీదారులు, విక్రయదారులను గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. పాత నేరస్తులు, అనుమానిత వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. నవోదయం 2.0లో భాగంగా అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. పన్ను చెల్లించని మద్యం అమ్మకం దారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కల్లు దుకాణాల్లో కల్తీ జరగకుండా నిరంతర తనిఖీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ఎక్సైజ్ స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

'పోలీస్ స్పందన'కు 60 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 60 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్, మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి పాల్గొన్నారు. కాగా, హోళీ సందర్భంగా ఈ నెల 14న కదిరిలోని ఎస్‌కేఎల్ఎన్ఎస్ అమృతవల్లి మహిళా డిగ్రీ కళాశాలలో చోటు చేసుకున్న ఘటనపై న్యాయం చేయాలంటూ డీఎస్పీ విజయ్‌కుమార్‌కు విద్యార్థినులు వినతి పత్రం అందజేశారు. తమ అభ్యర్థన మేరకే హోళీ జరుపుకునేందుకు ప్రిన్సిపాల్ వెంకటపతి అనుమతించారని, అంతేకాక తన సతీమణితో కలసి వేడుకల్లో ఆయన పాల్గొన్నారని వివరించారు. సరదాగా కేరింతలు కొడుతున్న సమయంలో గిట్టని కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమ తండ్రి లాంటి వ్యక్తి లైంగిక వేధింపులకు గురిచేశారనే ఆరోపణలను తాము ఆక్షేపిస్తున్నామని, ఈ అంశంలో సమగ్ర విచారణ చేపట్టి ప్రిన్సిపాల్‌కు న్యాయం చేయాలంటూ కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

EAMCET / JEE / NEET

■ Excellent Coaching. Intensive Coaching. Sarada Academy, 2nd Cross, Ashok Nagar, Anantapur. Cell: 9866117303, 6281158454. [A-43]

REAL ESTATE

TO-LET

■ డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, మంచినీరు పుష్కలం, బాడుగ Rs. 8000/- మాత్రమే. అనంతపురం టౌన్ నందు కళ్యాణదుర్గం రోడ్డుకు, Dr. రజాక్ హాస్పిటల్ వద్ద. Ph: 9951626131. [A-1543]

WANTED

■ S.R. డిఫెన్స్ అకాడమీ, అనంతపురం నందు ఫిజికల్ ట్రైనర్స్ (P.E.T) ఓన్లీ మేల్ & లేడీ టెలికాలర్స్ ఓన్లీ FM కావలెను. సంప్ర : 9780029999. [A-1550]

■ JOBS: కిచెన్ వేర్ ఐటమ్స్, జిల్లా వ్యాప్తంగా మార్కెటింగ్ కొరకు, అనుభవంగల సేల్స్ ఎగ్జిక్యూటివ్ కావలెను. మంచి జీతం + ఇన్సెంటివ్ + TA, DA ఇవ్వబడును. # శ్రీ విష్ణు ఎంటర్ ప్రైజెస్, ATP. 9000786886, 7207472886. [A-1542]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీ: 20K. Ph : 8977639663, 8977639662 [HA-1904]



■ WANTED marketing manager or super visors.Tirumala Builders &Interiors We provide All type of wood works with 3d design Cont: 7013853698, 9398944218 [A-3883]

■ SOLAR ప్రొడక్ట్స్ ఇన్‌స్టలేషన్ కొరకు, ITI చదివిన అబ్బాయిలు & ఆఫీస్ వర్క్ కొరకు కంప్యూటర్ నాలెడ్జ్ గల అమ్మాయి కావలెను. # ప్రశాంతి నగర్, తపోవనం దగ్గర, ATP. 9160353879 [A-1547]

■ ENGINEERING COLLEGE OFFICE నందు పని చేయుటకు స్త్రీ టెలికాలర్స్ కావలెను. సంప్రదించండి CELL: 9494321337, ANANTAPUR. [SCA25002342]

■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA 25002346]

■ Wanted Technician 10th ITI, Inter, P/F. Work with aquaguard service center opportunity earn 10-20K Per month training will provide 9966339211 [SCA-25002260]

■ Wanted Technical Persons / Evaluators for purchase of used cars. Candidates with Prior experience / Freshers (ITI / Diploma/ Degree) / Service Advisors (4 W) may apply. 4W Driving License is compulsory. Cont: 8333929186. [A-726]

గమనిక


సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తీరు మారదు.. కక్కుర్తి తీరదు

- మెమోలిచ్చినా తీరు మార్చుకోని ప్రభుత్వ వైద్యులు
- రూ.లక్షల్లో ప్రభుత్వ జీతం
- అయినా అడ్డగోలు సంపాదనపై మోజు
- కమీషన్ల కోసం రోగులపై అదనపు ఆర్థిక భారం



కదిరిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి



ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌కు రెఫర్ చేసిన ప్రిస్కిప్షన్

కదిరి అర్బన్: కమీషన్ల మోజులో వైద్య సేవలను నిర్లక్ష్యం చేస్తూ వృత్తికి మాయని మచ్చను తెస్తున్నారు కొందరు డాక్టర్లు. రూ.లక్షల్లో ప్రభుత్వ జీతం తీసుకుంటూనే అడ్డగోలు సంపాదనపై మోజుతో రోగులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో అన్ని సేవలూ ఉచితం కాగా, కొందరు డాక్టర్ల తీరుతో ఆ సేవలు కాస్త అభాసుపాలవుతున్నాయి. ఇందుకు నిదర్శనమే కదిరిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి. ఇక్కడ సేవ అనే పదానికి అర్థం లేకుండా పోయింది. ఇక్కడి వైద్యుల కాసుల కక్కుర్తి కారణంగా రూ.వేలల్లో ఆర్థిక భారాన్ని నిరుపేద రోగులు భరించాల్సి వస్తోంది.

కాసుల కక్కుర్తికి పరాకాష్టగా...

ఈ నెల 7న కదిరి మండలం చిప్పలమడుగు గ్రామానికి చెందిన గర్భిణి అంజలి పురిటి నొప్పులతో కాన్పు కోసం కదిరి ఏరియా ఆస్పత్రికి రాగా, ఆమెకు గర్భంలో సమస్య ఉందని నాలుగు స్కానింగ్‌లను చేయించుకుని రావాలంటూ గైనకాలజిస్టు ఒకరు ఆస్పత్రి పక్కనే ఉన్న ప్రైవేట్ ల్యాబ్‌కు రెఫర్ చేశారు. ఆస్పత్రిలో స్కానింగ్ చేయరా? అని అంజలి బంధువులు అడిగితే ఇక్కడ అలాంటి సౌకర్యం లేదని బుకాయించడంతో గత్యంతరం లేని స్థితిలో అంజలి కుటుంబసభ్యులు రూ.4,500 ఫీజు చెల్లించి ప్రైవేట్ ల్యాబ్‌లో స్కాన్ చేయించారు. ఈ అంశంపై ఈ నెల 11న 'ప్రభుత్వ డాక్టర్ అత్యాశ' శీర్షికన 'సాక్షి'లో కథనం వెలువడిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంటనే సదరు డాక్టర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆస్పత్రిలో రూ. 45 లక్షలు విలువ చేసే అత్యాధునిక స్కానింగ్ యంత్రాలు ఉన్నా... గర్భంలో సమస్య ఉందంటూ భయభ్రాంతులకు గురి చేస్తూ కమీషన్ల కోసం ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లకు రెఫర్ చేస్తున్న ప్రభుత్వ వైద్యుల కాసుల కక్కుర్తికి ఈ ఘటన పరాకాష్టగా నిలిచింది.

నాటి ఘటన మరువకనే..

ఈ నెల 10న వెలుగు చూసిన కదిరి ఏరియా ఆస్పత్రి వైద్యుల కాసుల కక్కుర్తి ఘటన మరువకనే మరో ఘటన వెలుగు చూసింది. తన నెలవారీ వైద్య పరీక్షల్లో భాగంగా ఈ నెల 22న కదిరిలోని మగ్గాల క్వాటర్స్‌కు చెందిన ఓ గర్భిణి కదిరి ఏరియా ఆస్పత్రికి వెళ్లింది. ఆమెను పరీక్షించిన డ్యూటీ గైనకాలజిస్ట్... గర్భస్థ శిశువు ఎదుగుదలపై స్కానింగ్ చేయించుకుని రావాలంటూ ఆర్ఎస్ రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌కు రెఫర్ చేశారు. ఇప్పటికే ప్రతి నెలా పలు రకాల వైద్య పరీక్షల కోసం ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లకు రూ.వేలల్లో ఫీజులు చెల్లించుకున్న సదరు గర్భిణి కుటుంబసభ్యులకు ఇది అదనపు ఆర్థిక భారంగా మారింది. దీంతో ప్రత్యామ్నాయ వైద్య పరీక్షల కోసం ఆరా తీస్తే గర్భంలో సమస్య ఉందంటూ భయభ్రాంతులకు గురి చేశారు. తప్పని పరిస్థితుల్లో సదరు గర్భిణిని పిలుచుకుని ఆర్ఎస్ రోడ్డులోని స్కానింగ్ సెంటర్‌కు కుటుంబసభ్యులు చేరుకున్నారు. విషయం కాస్త బయటకు పొక్కడంతో ఈ అంశాన్ని విజయవాడకు వ్యక్తిగత పనిపై వెళ్లిన ఆస్పత్రి సూపరింటెండెంట్ దృష్టికి పాత్రికేయులు ఫోన్‌లో తీసుకెళ్లారు. దీంతో ఆయన అసహనానికి గురై వెంటనే సదరు గైనకాలజిస్ట్‌కు ఫోన్ చేసి మందలించడంతో ఆమె స్కానింగ్ సెంటర్ నిర్వాహకులకు ఫోన్ చేసి తాను పంపిన గర్భిణికి స్కానింగ్ చేయకుండా వెనక్కు పంపాలని అభ్యర్థించినట్లు తెలిసింది.

స్పందించని అధికారులు..

ఈ నెల 7న పురిటి నొప్పులతో ఏరియా ఆస్పత్రికి వచ్చిన గర్భిణికి గర్భంలో సమస్య ఉందంటూ నాలుగు స్కానింగ్‌లకు ప్రైవేట్ ల్యాబ్‌కు రెఫర్ చేసిన గైనకాలజిస్ట్‌కు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ మెమో జారీ చేశారు. ఇది జరిగి రెండు వారాలకు పైగా అవుతున్నా... ఇప్పటి వరకూ సదరు గైనకాలజిస్ట్‌పై ఎలాంటి చర్యలూ లేవు. ఇదే అంశంపై సదరు గర్భిణి మామ రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. తాజాగా జరిగిన ఘటనలో సంబంధిత గైనకాలజిస్ట్ మాట్లాడుతూ.. హిందూపురానికి చెందిన తన బంధువుల అమ్మాయికి రాసిన స్కానింగ్ ప్రిస్కిప్షన్‌ను పొరపాటున అదే పేరుతో ఉన్న కదిరికి చెందిన గర్భిణి తీసుకెళ్లిందన్నారు. విషయం ఆలస్యంగా గుర్తించిన వెంటనే స్కానింగ్ సెంటర్ డాక్టర్‌కు ఫోన్ చేసి ఆ స్కానింగ్ చేయొద్దని తెలిపి, ఆమెను తిరిగి ఆస్పత్రికి పిలిపించి ఇక్కడే స్కానింగ్ చేయించినట్లు వివరించారు.

వీళ్లింతే మారరు



రోగ నిర్ధారణ, గర్భస్థ శిశువు ఎదుగుదల పరిశీలన తదితర అంశాలపై ప్రైవేట్ ల్యాబ్‌లకు రెఫర్ చేయరాదని పలుమార్లు ఇక్కడి డాక్టర్లకు చెబుతూనే ఉన్నాం. అయినా వారి పని తీరు మారలేదు. ఇక నాతో కాదు. వీరు మారరు. నేనే ఇక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ పెట్టుకుని వెళ్లిపోతా. ఈ నెల 7న బయటకు స్కానింగ్ రాసిన డాక్టర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశాను. ఆమె వివరణను ఉన్నతాధికారులకు పంపాను.

– డాక్టర్ హుస్సేన్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

